క్లుప్తంగా

డ్రోన్లతో నిఘా



మంగళగిరి: డ్రోన్ల సహకారంతో అసాంఘిక శక్తుల ఆగడాలను అడ్డుకట్ట వేయడమే లక్ష్యమని రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం నగర పరిధిలోని ఆత్మకూరు నిర్మల పాఠశాల, వీజే కళాశాల, ఆత్మకూరు జంక్షన్ వద్ద డ్రోన్ల సహకారంతో ట్రాఫిక్, ప్రమాదాలను సమీక్షించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డ్రోన్ల సహకారంతో ఒకే చోట నుంచి పరిస్థితులను సమీక్షించి, వెంటనే అదుపులోకి తీసుకురావచ్చన్నారు. రూరల్ పరిధిలోని అసాంఘిక శక్తులు, కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా ప్రతి రోజు నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా, పేకాట ఆడినా ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా వెంటనే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సీహెచ్ వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.

చిర్రావూరు పశువైద్యాధికారి బాధ్యతల స్వీకరణ



తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని చిర్రావూరు గ్రామ పశువైద్యాధికారిణిగా డాక్టర్ ఛాయా వినయదేవి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షుడు ముసునూరు సుహాస్ మాట్లాడుతూ చిర్రావూరు గ్రామం పదేళ్ల కల నెరవేరిందన్నారు. గత నెలలో గ్రామానికి రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరపు అచ్చన్నాయుడు వచ్చినప్పుడు పశువైద్యాధికారి కావాలని విన్నవించినట్లు తెలిపారు. డాక్టర్ ఛాయా వినయదేవి మాట్లాడుతూ గ్రామంలో పశువులు ఎక్కువగా ఉన్నాయని, బుధ, గురు, శనివారాల్లో అందుబాటులో ఉంటానని తెలిపారు.

ఎంఎస్ఎంఈ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి



తాడికొండ: ప్రభుత్వం రాయితీపై అందించే ఎంఎస్ఎంఈ రుణాలకు అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయ్ కుమార్ సూచించారు. శనివారం తాడికొండ ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ వర్క్‌షాప్, రిజిస్ట్రేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. చిన్న, సన్నకారు పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రాయితీపై రుణాలను అందజేస్తుందని, ఆయా వివరాలు తెలిపి చిన్న పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు వర్క్‌షాప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ ఎం శ్రీనివాసరావు, ఎంపీడీవో కె సమతావాణి పలువురు సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుద్ధ్యం దిశగా చర్యలు



లాం(తాడికొండ): గ్రామ పంచాయతీల్లో సంపూర్ణ పారిశుద్ధ్యం దిశగా కార్యదర్శులు, క్లాప్ మిత్రలు పనిచేయాలని తాడికొండ, తుళ్లూరు మండల ఎంపీడీవోలు కె.సమతావాణి, కానూరు శిల్ప సూచించారు. శుక్రవారం తాడికొండ మండలం లాం గ్రామంలోని తాడికొండ, తుళ్లూరు మండలం పెదపరిమి, హరిశ్చంద్రపురం, వడ్డమాను గ్రామాల క్లాప్ మిత్రలకు నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా విచ్చేసి, ప్రసంగించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్వహణ సక్రమంగా చేయడం ద్వారా చెత్త రహిత గ్రామాలుగా గ్రామాలు తీర్చిదిద్దుకోవచ్చన్నారు. ఈవోఆర్డీ కె.సాయిలీల, డీపీఆర్సీ అధికారి ఎస్.నిరంజన్, పంచాయతీ కార్యదర్శులు ఎం.శ్రీనివాస్, కె శ్రీనివాస్, సత్యన్నారాయణ, అరుణ్ కుమార్ పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాహన ఖండం!



మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో తుప్పపట్టిన ద్విచక్ర వాహనాలు

- పోలీస్ స్టేషన్లలో మగ్గిపోతున్న వాహనాలు
- పలు కేసుల్లో కండిషన్‌లో స్వాధీనమైన శకటాలు శిథిలావస్థకు
- సకాలంలో వేలం వేయడంలో అధికారుల నిర్లక్ష్యం
- కోర్టు కేసులు తేలక మరికొన్ని మూలకు
- తుక్కు కింద తూకానికి చివరకు మిగిలేది..

మంగళగిరి టౌన్: అక్రమ రవాణాలో పట్టుబడిన వాహనాలు ఖండమవుతున్నాయి. ఏళ్ల తరబడి కేసులు తేలకపోవడంతో తుప్పుపట్టిపోతున్నాయి. పాత ఇనుప సామాన్లకు వేసుకోవడానికి మినహా ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. పోలీసులకు దొరక్కూడదు.. రోడ్డు ఎలా ఉన్నా.. వేగంగా వెళ్లాలి.. అనే ఆలోచనలతో అక్రమ మార్కులు మంచి కండిషన్ ఉన్న వాహనాలు ఉపయోగిస్తున్నారు. ప్రమాదాలు కావచ్చు.. నిబంధనలకు విరుద్ధంగా నడపడం కావచ్చు.. కారణం ఏమైనా పోలీస్ స్టేషన్లకు వచ్చిన వాహనాల కండిషన్ బాగానే ఉన్నా.. కేసులు తేలే లోపు..అవి ఖండమే.

సకాలంలో చర్యలు చేపడితే..

ఇలాంటి వాహనాలు ఏ కారణంతో అయినా ఒక్కసారి పోలీస్‌స్టేషన్‌కు వస్తే చాలు..తుప్పు పట్టి శిథిలమవుతున్నాయి. వీటన్నింటిని సకాలంలో వేలం వేయగలిగేలా చర్యలు చేపడితే మంచి ధర పలికి ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. లేకుంటే తుప్పు పట్టిన వాహనాలను పాత ఇనుప సామాన్ల వ్యాపారులకు తూకాలకు వేయాల్సిందే.

అక్రమ రవాణాలో దొరికి..

చాలా వాహనాలు పోలీస్ స్టేషన్లకు చేరడానికి రోడ్డు ప్రమాదాలకు ఒక కారణమైతే.. అక్రమ మద్యం, గంజాయి, రేషన్ బియ్యం సరఫరా, జూదాలు, కోడి పందేలపై పోలీసు దాడుల్లో పట్టుబడిన వాహనాలే అధికం. ఇక దొంగతనాల్లో దొరికిన ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు, కార్లు, ఆటోలు, లారీలు ఇందులో ఉన్నాయి. చిన్న చిన్న ప్రమాదాలకు సంబంధించి రాజీ మార్గాల ద్వారా వాహనాలను యజమానులు తీసుకుపోతూ ఉంటారు. మిగిలిన కేసుల్లో వాహనాలు స్టేషన్లకు చేరుతున్నాయి. కొన్ని వాహనాలకు సంబంధించి యజమానులకు కోర్టులు జరిమానాలు విధిస్తుంటాయి. జరిమాన కట్టేంత కూడా ఈ వాహనాలు ధరలు పలకవన్న కారణంగా కొంతమంది వదిలేస్తున్నారు.

పరిష్కారం కాని కేసులు..

కేసులు పరిష్కారం కానందున వాహనాలు అలా ఉండిపోతున్నాయన్నది పోలీసుల మాట. కేసులు పరిష్కారం అయ్యేవరకు మద్యం కేసులో పట్టుబడిన వాహనాలను వేలం వేసే అవకాశం లేదని చెబుతున్నారు. పట్టుబడిన వాహనాలను సకాలంలో వేలం వేసేలా ప్రభుత్వం ప్రత్యేక చట్ట సవరణ చేయాల్సిన అవసరం ఉంది. అప్పుడు ప్రభుత్వానికి ఎంతోకొంత ఆదాయం లభిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మంగళగిరి నార్త్ సబ్‌డివిజన్ పరిధిలో మంగళగిరి పట్టణ, రూరల్ పోలీస్‌స్టేషన్, తాడేపల్లి పోలీస్‌స్టేషన్, దుగ్గిరాల పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. ఆయా పోలీస్‌స్టేషన్‌ల ఆవరణలో వందల సంఖ్యలో వాహనాలు దర్శనమిస్తున్నాయి.



రూరల్ సర్కిల్ కార్యాలయంలో సీజ్ చేసిన కార్లు, ఆటోలు, ట్రాక్టర్లు

మాయమవుతున్న విడి భాగాలు

పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వాహనాల్లోని విడిభాగాలు చాలా వరకు మాయమవుతున్నాయి. స్టేషన్ ఆవరణకు దూరంగా ఇలాంటి వాహనాలు ఉంచుతున్నారు. స్టేషన్‌కు నిత్యం ఎంతోమంది కేసులు, ఇతర పనులపై వచ్చి పోతుంటారు. మంగళగిరి పట్టణ, రూరల్ సర్కిల్ కార్యాలయంతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాలు, సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, ట్రెజరీ ఆఫీస్ తదితర కార్యాలయాలు ఒకే ఆవరణలో ఉంటాయి. దీంతో పనుల కోసం వచ్చే ఎంతోమంది పగటిపూట వాహనాలు చూసిన వారు, రాత్రిపూట విడి భాగాలను కొందరు తీసుకెళ్తున్నారు. దీంతో మిగిలిపోయిన భాగాలు మట్టిలో కలిసిపోతున్నాయి.

పోలీసులు ఏం చేయాలంటే....

ప్రమాదవశాత్తు లేదా ఇతర కారణాలతో సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చిన వాహనాలను రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా చేయాలి. అలా చేసిన వాహనాలను ఆరు నెలలకు ఒకసారి బహిరంగ వేలం ద్వారా విక్రయించాలి. ఇలా ఎక్కడా జరగడం లేదని తెలుస్తోంది. మంగళగిరిలో అయితే కొన్ని సంవత్సరాలుగా బహిరంగ వేలం జరగలేదని అంటున్నారు. వాహనాలకు వేసిన జరిమానాలు కట్టి తీసుకువెళ్లని వాహనాలను గుర్తించి వేలం ద్వారా విక్రయిస్తే ప్రభుత్వానికి కొంత ఆదాయం వచ్చేది. పోలీస్‌శాఖ ఆ చర్యలు చేపట్టకపోవడంతో వందలాది వాహనాలు స్టేషన్ ఆవరణలో మగ్గుతున్నాయి. అధికారులు వాహనాలను వేలం వేసి ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



కరపత్రాలు అందజేస్తున్న కమిషనర్ అలీమ్‌బాషా, అధికారులు

తాడేపల్లిరూరల్: ప్రతి ఒక్కరు తాము నివాసముంటున్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా అన్నారు. స్వచ్ఛ మంగళగిరి కార్యక్రమంలో భాగంగా మంగళగిరి, తాడేపల్లి పట్టణాల్లో శుక్రవారం నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను ఆయన పర్యవేక్షించారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని చెప్పారు. పరసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రోడ్లపై చెత్తను ఊడ్చి శుభ్రం చేయించారు. మురుగు కాలువల్లో బ్లీచింగ్ చల్లించారు. దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టారు. ఎంటీఎంసీ అదనపు కమిషనర్ శకుంతల, డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, ఎంటీఎంసీ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

65 శాతం ఆరోగ్య సర్వే



ఫిరంగిపురం: సాధారణ, అసాధారణ వ్యాధులపై అవగాహన అవసరమని డాక్టర్ శ్వేత అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఎన్‌సీ డీసీడీ ప్రోగ్రాంలో భాగంగా ఇంటింటికి ఆరోగ్య సిబ్బంది తిరిగి వ్యక్తగత ఆరోగ్య పరీక్షలు చేసి, వివరాలు యాప్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. బీపీ, షుగర్, యూరిన్, థైరాయిడ్ పరీక్షలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే ఫిరంగిపురం పీహెచ్‌సీ పరిధిలోని 113 తాళ్లూరు, శిరంగిపాలెం, తక్కెళ్లపాడు, ఫిరంగిపురం. అమీనాబాద్, వేములూరిపాడు, రేపూడి, గొల్లపాలెం గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది ఈ పరీక్షలు 65శాతం పూర్తిచేశారని వెల్లడించారు.

సీఐటీయూకు ఐద్వా ధన్యవాదాలు

తాడేపల్లిరూరల్: ఆశా వర్కర్ చంద్రమ్మకు అండగా నిలిచిన సీఐటీయూ నాయకులకు ఐద్వా నాయకురాలు రమాదేవి, బి.ప్రభావతి ధన్యవాదాలు తెలిపారు. కొలనుకొండలోని ఐద్వా కార్యాలయం నుంచి శుక్రవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక అనేకచోట్ల ఆశ, మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీ యానిమేటర్లను గ్రామ నాయకులు ఎమ్మెల్యేల అండతో అక్రమ పద్ధతుల్లో తొలగించారని పేర్కొన్నారు. వారి వేధింపులు తాళలేక కొంత మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం గెద్దలపాడు గ్రామంలో ఆశ వర్కర్ చంద్రమ్మను అక్రమంగా తొలగించి, గ్రామ బహిష్కరణ చేసిన గ్రామ పెద్దలపై పోరాడి విజయం సాధించారని వివరించారు. చంద్రమ్మ పోరాటం బాధిత మహిళలకు స్ఫూర్తిదాయకమని, అండగా నిలిచిన సీఐటీయూ సంఘానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మోసపు హామీలతో ప్రజలను నిలువునా ముంచారు

- సూపర్ సిక్స్‌ను అటకెక్కించిన సీఎం చంద్రబాబు
- వైఎస్సార్‌సీపీ మంగళగిరి సమన్వయకర్త వేమారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

మంగళగిరి: గత ఎన్నికల్లో మోసపు హామీలతో అధికారం దక్కించుకున్న సీఎం చంద్రబాబు నాయుడు అనంతరం ప్రజలను నిలువునా మోసం చేశారని వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం నగర పరిధిలోని ఆత్మకూరులో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నాలి వెంకటకృష్ణ అధ్యక్షతన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వేమారెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు సూపర్ సిక్స్ హామీలను తలచుకుంటే.. డబ్బులు ఎక్కడ నుంచి తేవాలని సీఎం చంద్రబాబు వారిని ప్రశ్నించడం విడ్డూరంగా ఉందన్నారు. మూడు సార్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబుకు ఎన్నికల ముందు హామీలు ఇచ్చేటప్పుడు రాష్ట్ర బడ్జెట్ గురించి తెలియదా అని నిలదీశారు. అబద్ధపు హామీలు, మోసపు మాటలు చెప్పకుండా తాను చేయగలిగిందే చెప్పి ఓట్లడిగిన నాయకుడు దేశ చరిత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని కొనియాడారు. ప్రతి కార్యకర్త ఇప్పటి నుంచే పార్టీ విజయం కోసం నిరంతరం ప్రజలతో ఉండి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి మల్లవరపు సుధారాణి, బీసీ సెల్ ప్రెసిడెంట్ తాడిబోయిన సుబ్బారావు, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ కట్టెపోగు భూషణం, పార్టీ సీనియర్ నాయకులు జాలాది నాగేశ్వరరావు, బొమ్ము సాంబిరెడ్డి, పల్లపు సాంబిరెడ్డి, మాన్యం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ నగదు చెక్కులు పంపిణీ



లబ్ధిదారులకు నగదు చెక్కులను అందజేస్తున్న టీడీపీ నాయకులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణంలో పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నగదు చెక్కులను తాడేపల్లి టీడీపీ నాయకులు శుక్రవారం అందజేశారు. తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకటరావు మాట్లాడుతూ 16 వార్డుకు చెందిన వలివేటి నాగేశ్వరరావుకు రూ.2,38,453, 17వ వార్డుకు చెందిన సయ్యద్ ఉస్మాన్‌కు రూ.1,32,570లు, తిరుమలశెట్టి నాగేశ్వరరావుకు రూ.58,500లు, 18వ వార్డుకు చెందిన కుంచాల అంకమ్మరావుకు రూ.45,895, 3వ వార్డుకు చెందిన కందుల రాంప్రసాద్‌కు రూ.40,350, గేదెల కృష్ణవేణికి రూ.76,959, 15వ వార్డుకు చెందిన బుర్రముక్కు పద్మావతికి రూ.57,706, 10వ వార్డుకు చెందిన కంతేటి జీవమ్మకు రూ.32,324, 7వ వార్డుకు చెందిన కడియం శ్రీనివాసరావుకు రూ.1,35,424, 14వ వార్డుకు చెందిన కొండేటి రాజేష్‌కు రూ.30,785, 1వ వార్డుకు చెందిన గోపిశెట్టి రాజేంద్రప్రసాద్‌కు రూ.32,324, 22వ వార్డుకు చెందిన సోమరౌతు సతీష్‌బాబుకు రూ.41,341, 19వ వార్డుకు చెందిన పోక నాగలక్ష్మికి రూ.51,486 నగదు చెక్కులకు వారి ఇళ్లకు వెళ్లి అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ తాడిబోయిన భాస్కర్, మాజీ కౌన్సిలర్లు ఇట్టా భాస్కర్, కేళి వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు ఇట్లా పెంచలయ్య, కొరపాటి రమణ, బెజ్జం రామకృష్ణ, రవికుమార్, అద్దంకి మురళి పాల్గొన్నారు.

బకింగ్‌హామ్ కాల్వలోకి దూసుకెళ్లిన లారీ



బకింగ్‌హామ్ కాల్వలో బోల్తా పడిన లారీ

దుగ్గిరాల: దుగ్గిరాల మండల పరిధిలోని మోరంపూడి సమీపంలో కాలువలో లారీ పల్టీ కొట్టిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం ఉయ్యూరు నుంచి తవుడు లోడ్‌తో తెనాలి వైపు వెళ్తున్న లారీ అదుపు తప్పి బకింగ్‌హామ్ కెనాల్ కాలువలోకి దూసుకువెళ్లి బోల్తా కొట్టింది. కాలువలో నీరు తక్కువగా ఉండడంతో డ్రైవర్ సత్యనారాయణకు స్వల్ప గాయాలు అయ్యాయి. కాలువ వైపు రోడ్డు అంచున తీవ్ర కోతకు గురైన కారణంగా తరచు వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

ఫిరంగిపురం: పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం చేకూరుతుందని సూపర్‌వైజర్ అబ్దుల్ రెహమాన్ అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఫ్రైడే- డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. ఇంటిలో ఉండే ఫ్రిజ్‌లు, నీటి కుండలు చుట్టూ ఉండే చల్లటి వాతావరణం చేత దోమలు వృద్ధి చెందుతాయని చెప్పారు.

28న వైద్యులకు క్విజ్ పోటీలు

గుంటూరు మెడికల్: రేడియాలజీ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో గుంటూరు ఐఎంఏ హాలులో ఈనెల 28న అకడమిక్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ చిటితోటి కిషోర్‌కుమార్ తెలిపారు. 'ది గమట్ ఆఫ్ బోవెల్ ఇమేజింగ్ ఎకేస్ బేస్డ్ అప్రోచ్ ఫ్రమ్ స్టమక్ టూ యానల్ కెనాల్' అనే అంశంపై అసోసియేషన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతారన్నారు. యువ రేడియాలజిస్టులు, పీజీ వైద్య విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. క్విజ్ పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి గెలుపొందిన వారికి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.8 వేలు, మూడో బహుమతి రూ.5 వేలు నగదు అందిస్తామని వివరించారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

మంగళగిరి టౌన్: ఓబీసీల ప్రధాన డిమాండ్లపై ఈ నెల 24, 25, 26 తేదీల్లో తలపెట్టిన చలో ఢిల్లీ నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశన శంకరరావు పిలుపునిచ్చారు. మంగళగిరి నగర పరిధిలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సారి జనగణనతో పాటే దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన జరపాలని, జనాభా దామాషా మేరకు చట్టసభల్లో ఓబీసీలకు రిజర్వేషన్లు కేటాయించాలని పేర్కొన్నారు. ఓబీసీల ప్రధాన డిమాండ్లపై ఈ నెల 24న కేంద్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులందరికి విజ్ఞాపన పత్రాలు సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. గతంలో సమగ్ర కులగణనకు అంగీకరించిన నేటి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పెద్దల అసలత్వానికి, జాప్యానికి నిరసనగా 25న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతికుమార్, శాలివాహన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎంవీఎస్ మూర్తి పాల్గొన్నారు.

భూ సేకరణకు రైతులు సహకరించాలి



ఫిరంగిపురం: జాతీయ రహదారి విస్తరణ కోసం సేకరించే భూసేకరణకు సంబంధిత రైతులు సహకరించాలని తహసీల్దార్ జె.ప్రసాదరావు అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం రైతులు, స్థానిక నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ హైవే అథారిటీ ఇండియా ఆదేశాల మేరకు వినుకొండ- గుంటూరు జాతీయ రహదారి నెంబర్ 544డీ నాలుగు లైన్ల విస్తరణలో భాగంగా 7 గ్రామాల రైతులతో సమావేశాలు నిర్వహించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ భార్గవతేజ ఆదేశాలు జారీ చేశారన్నారు. దానిలో భాగంగా భూ సేకరణకు సంబంధిత రైతులతో వివరించామన్నారు. రైతు నుంచి సేకరించే ప్రతి సెంటు ప్రభుత్వం ధర చెల్లించుతుందని చెప్పారు. రేపూడి, ఫిరంగిపురం, అమీనాబాద్ గ్రామాల రైతులతో సమావేశం నిర్వహించి, వారికి వివరించినట్లు తెలిపారు. శనివారం పొనుగుపాడు, మేరికపూడి గ్రామాల రైతులతో సచివాలయంలో ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహిస్తామన్నారు. వేమవరం, నుదురుపాడు గ్రామాల రైతులతో 11 గంటలకు సచివాలయంలో నిర్వహిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో రైతులు, నాయకులు పాల్గొన్నారు.

గురువులను, తల్లిదండ్రులను గౌరవించాలి



తాడేపల్లిరూరల్: విద్యార్థులు తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలని ప్రభుత్వ కమ్యూనికేషన్స్ డీజీ ఎస్.ఎస్.జె.లక్ష్మి అన్నారు. శుక్రవారం వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో కేఈఎస్ పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కమ్యూనికేషన్స్ డీజీ మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి ఒకరు పరిశ్రమ ఏర్పాటు చేసి, పది మందికి ఉద్యోగాలు కల్పించాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకుని, అందుకు అనుగుణంగా ముందుకెళ్లాలని సూచించారు. కృష్ణా ఇండస్ట్రియల్ అండ్ అగ్రికల్చర్ ఎగ్జిబిషన్ సొసైటీ సెక్రటరి జీవీ రామారావు మాట్లాడుతూ కేఈఎస్ పాలిటెక్నికల్ కళాశాల స్థాపించి దాదాపు 43 సంవత్సరాలు దాటిందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు క్విజ్, గ్రూప్ డిస్కషన్స్, డిబేట్, పోస్టర్ ప్రజంటేషన్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, రన్నింగ్, షటిల్ పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణా ఇండస్ట్రియల్ అండ్ అగ్రికల్చర్ ఎగ్జిబిషన్ సొసైటీ జాయింట్ సెక్రటరి పార్థసారథి, కేఈఎస్ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమాజం గర్వించే లక్ష్యంతో ముందుకు సాగాలి



తాడికొండ: సమాజం గర్వించేలా ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని వైజ్ వర్క్స్ కంపెనీ సీఈవో డాక్టర్ మదన్ కుమార్ శ్రీనివాస్ అన్నారు. చలపతి ఎడ్యుకేషన్ సొసైటీ 30 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 3 రోజులుగా కొనసాగుతున్న క్రీడా, సాంస్కృతిక పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు కళాశాల స్థాయిలోనే వివిధ రకాల ప్రాజెక్టులు చేయడం లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయములు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని అన్ని రకాల అక్రిడేషన్స్ కలిగిన ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలలు, స్కూల్, ఇంటర్, డిగ్రీ కోర్సులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వాటి ద్వారా నాణ్యమైన విద్యను అందించేందుకు నిరంతరం తపన పడుతున్నట్లు తెలిపారు. విద్యా సంస్థల కార్యదర్శి వై.సుజిత్ కుమార్, కార్డియాలజీ వైద్యులు డాక్టర్ అంజిత్ ఉప్పుటూరి, ప్రిన్సిపల్ డాక్టర్ కె.నాగ శ్రీనివాసరావు, డైరెక్టర్ డి.వినయ్ కుమార్, కన్వీనర్ డాక్టర్ ఫణికుమార్, కో-కన్వీనర్ డాక్టర్ వీవీ సుబ్బారావు, డాక్టర్ బాల మురళీకృష్ణ, డాక్టర తులసీ రాణి, రాము, రాజు వివిధ శాఖాధిపతులు పాల్గొన్నారు.